క్లుప్తంగా

పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీలు



కడియంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ షబ్నం

కడియం: వేసవి సెలవుల్లో పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు ఆర్టీసీ ప్రయాణం అన్ని విధాలా శ్రేయస్కరమని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షబ్నం అన్నారు. కాశీ, అరుణాచలం, సింహాచలం, తిరుపతి, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను అతి తక్కువ ధరల్లో, సురక్షితంగా దర్శించుకునేందుకు ఆర్టీసీలో ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు. యాత్రికులు ఈ మేరకు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు కడియం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో దుప్పలపూడి రామకృష్ణ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఇసుకపట్ల బాలరాజు, మోసిగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలకు 701 మంది హాజరు



ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్, కాపు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియలకు సబ్సిడీపై రుణాలు మంజూరుకు గురువారం జరిగిన ఇంటర్వ్యూలకు 701 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉదయం ధవళేశ్వరం, తొర్రేడు, వెంకటనగరం గ్రామాలు, మధ్యాహ్నం నుంచి కాతేరు, కోలమూరు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. వివిధ శాఖల బ్యాంకు అధికారులు, మండలపరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆకెళ్ల ప్రసాద్, ఈవోపీఆర్అండ్ఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ పీవీఆర్ గార్డెన్స్, ఆల్ బ్యాంక్ కాలనీ, మోడల్ కాలనీ, శ్రీ నగర్ కాలనీ, సాయిబాబా గురుస్థానం, రైతు బజార్ రోడ్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, పీఎఫ్ ఆఫీస్ రోడ్, బాబూరావు గార్డెన్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వీఎల్ పురం సెంటర్, ఆదిరెడ్డి అప్పారావు వీధి, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఏరియా, పోస్టల్ కాలనీ, ఆర్యాపురం కో ఆపరేటివ్ బ్యాంక్ ఏరియా, తిలక్ రోడ్ సాయిబాబా టెంపుల్ ఎదుట వీధుల్లో సరఫరా నిలిచిపోతుందన్నారు.

సత్యనారాయణమూర్తి మృతికి సంతాపం

కడియం: డీసీసీబీ మాజీ డైరెక్టర్ గట్టి సత్యనారాయణమూర్తి మృతికి పలువురు సంతాపం తెలిపారు. బుర్రిలంకలోని స్వగృహంలో సత్యనారాయణమూర్తి భౌతిక కాయాన్ని సందర్శించి, పుష్పాంజలి ఘటించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు. బుర్రిలంక కైలాసభూమిలో సత్యనారాయణమూర్తి అంత్యక్రియలు జరిగాయి.

సినిమాలు



శ్యామల :	రాబిన్‌హుడ్
సూర్యమినీ :	ఏమైన్‌క్రాఫ్ట్‌మోవ్, సికిందర్
సూర్యప్యాలెస్ :	ఎల్‌వైఎఫ్ (లవ్ యువర్ ఫాదర్)
స్వామి :	కోర్ట్
శివజ్యోతి :	రాబిన్‌హుడ్
అనుశ్రీ :	వీరధీరశూర
రాజా :	రాబిన్‌హుడ్
ఊర్వశి :	ఎల్2ఎంపురాన్
మేనక :	28సి
రంభ :	సరే
కుమారి :	ఆదిత్య 369
అప్సర :	మ్యాడ్ స్క్వేర్
అశోక : నామవరం	మ్యాడ్ స్క్వేర్
వీఎస్ మహల్ : ధవళేశ్వరం	మ్యాడ్ స్క్వేర్
మురళీకృష్ణ : కడియం	మ్యాడ్ స్క్వేర్
వెంకటసూర్య :	మ్యాడ్ స్క్వేర్

జంబలకిడి పంబ

- ప్రభుత్వాస్పత్రిలో నిర్వాకం
- ఎముకల వైద్యుడిగా ఫిజియోథెరపిస్ట్
- ఫిజియోథెరపీ చేస్తున్న సిబ్బంది
- రద్దీ సమయంలో కానరాని ఆర్థో వైద్యులు



ఆర్థో ఓపీ చూస్తున్న ఫిజియోథెరపిస్ట్ సత్యనారాయణ

కంబాలచెరువు: కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా 250 పడకల వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి నుంచి వెయ్యి పడకలుగా మారిన బోధనాసుపత్రి రోజురోజుకీ తన ప్రమాణాలను దిగజార్చుకుంటోంది. అందుకు కొందరు వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. టెలి వైద్య విభాగంలో వైద్యులు ఖాళీగా కాలు చాపుకొని కూర్చోవడం ఇటీవల విమర్శలకు దారితీస్తే, ఎముకల విభాగం వైద్యుల నిర్వాకం, ఫిజియోథెరపిస్ట్ అత్యుత్సాహం రోగులతో చెలగాటమాడింది. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వాసుపత్రిలో ముగ్గురు ఆర్థో విభాగం వైద్యులు ఉన్నారు. అయితే గురువారం ఒక్క వైద్యుడు కనిపించలేదు. ఎముకల విభాగంలో వైద్యులందరూ ఉదయం 11 గంటలకే కనిపించకుండా వెళ్లిపోయారు. దీంతో ఆ విభాగానికి ఫిజియోథెరపీ వైద్యుడే దిక్కయ్యాడు. ఆ వైద్యుడు తన విభాగాన్ని వదిలి ఎముకల వైద్యుడిగా అవతారమెత్తి రోగులను వైద్యం అందించాడు.

రోగుల పడిగాపులు

ఫిజియోథెరపీ గది బయట అధిక సంఖ్యలో రోగులు పడిగాపులు పడుతూ కూర్చున్నారు. అక్కడ వైద్యం చేసే ఫిజియోథెరపిస్ట్ సత్యనారాయణ ఆర్థో డాక్టర్‌గా రోగుల ఓపీ చూస్తూ వారికి మందులు రాశాడు. ఎంఆర్ఐ స్కానింగ్‌లు, సిటీ స్కాన్లు కూడా ఫిజియోథెరపిస్టే రాసేస్తున్నాడు. ప్రమాదం అని తెలిసినా ఎటువంటి అనుభవం లేకుండా ఏకంగా రోగులకు మందులే రాసేస్తున్నాడు.

కిక్కిరిసిన ఆస్పత్రి

ఇక ఫిజియోథెరపీ విభాగంలో అయితే సిబ్బందే ఫిజియోథెరపిస్టులుగా మారి, రోగులకు వైద్యం చేస్తూ కనిపించారు. అలాగే పెద్ద సంఖ్యలో వచ్చిన రోగులతో ఆసుపత్రి పూర్తిగా కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా ఆర్థో, ఫిజియోథెరపీ విభాగాలకు రోగులు క్యూ కట్టారు. అంత రద్దీలోనూ ఆసుపత్రిలో ఉండాల్సిన ముగ్గురు ఆర్థో డాక్టర్లు ఎక్కడికో వెళ్లారు.

రోగుల అవస్థలు

వైద్యం కోసం ఎంతో దూరం నుంచి వ్యయ, ప్రయాసలకోర్చి ప్రభుత్వాసుపత్రికి వచ్చే పేద రోగులు అవస్థలు పడుతున్నారు. వీరు ఫిజియోథెరపీ వైద్యుడితో తూతూ మంత్రం వైద్యం చేయించుకుని వెళ్లిపోతున్నారు. కొందరు అతడే ఎముకల డాక్టర్ అని అనుకుంటున్నారు.

సొంత ఆసుపత్రులకు రిఫర్

ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులను కొందరు వైద్యులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న క్లినిక్ వద్దకు రప్పించుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. జనరల్‌గా ప్రభుత్వాసుపత్రిలో చిన్నపాటి వైద్యం చేసి ఏవో సాకులు చెప్పి, వారిని ఆరోగ్య విషయంలో భయపెడుతూ సొంత క్లినిక్‌లకు రప్పించుకోవడం, వారికి అవసరమైన ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఇతర వైద్య పరీక్షలను రాస్తూ ధనార్జనకు శ్రీకారం చుడుతున్నారని చెబుతున్నారు. వీరు ప్రభుత్వాసుపత్రికి వచ్చి రోగులను కంబాలచెరువు, వుమెన్స్ కళాశాల, గోకవరం బస్టాండ్ ప్రాంతాల్లోని తమ సొంత ఆసుపత్రులకు రప్పించుకుంటున్నారు.



ఎముకల విభాగంలో ఖాళీగా కనిపిస్తున్న ఫిజియోథెరపిస్ట్ కుర్చీ



రోగులకు ఫిజియోథెరపీ వైద్యం చేస్తున్న సిబ్బంది



ఎముకల విభాగంలో వేచిఉన్న రోగులు

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వాసుపత్రిలో ముగ్గురు ఆర్థో వైద్యులున్నారు. ఒక ఫిజియోథెరపిస్టు సేవలందిస్తున్నారు. వీరందరూ ఎవరి విభాగంలో వారే పనిచేయాలి. ఫిజియోథెరపిస్టు ఎట్టి పరిస్థితిలోనూ ఆర్థో ఓపీ చూడకూడదు. ఆర్థో విభాగంలో రోగులను చూడకుండా ఫిజియోథెరపిస్టు చూస్తున్నారనే దానిపై విచారణ చేసి, తగిన చర్యలు చేపడతాం.

– డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాసుపత్రి

నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన



కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నగరంలోని లాలాచెరువుకు వెళ్లే రహదారిలో 'అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన'కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి (క్రియేటివిటీ అండ్ కల్చర్) కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. ఆమె గురువారం ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఈ కార్యక్రమం వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనను పురస్కరించుకుని ప్రముఖ కళాకారుల చిత్ర ప్రదర్శనలు, వాటికి అనుగుణంగా స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ప్రదర్శిస్తున్న వివిధ కళా ప్రదర్శనలను అధ్యానం చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనకు వచ్చే నిధులతో స్థానిక దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

కంబాలచెరువు: నగరంలోని సెంట్రల్ జైలు రోడ్డులో శుక్రవారం అమరావతి చిత్రకారుల వీధి ప్రదర్శన జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆ వివరాలను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ విలేకరులకు తెలిపారు. గురువారం రాత్రి 10 నుంచి శుక్రవారం రాత్రి 10 గంటల వరకు ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. దాని ప్రకారం.. లాలాచెరువు జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు డీటీసీ, జేఎన్ రోడ్, మోరంపూడి మీదుగా వెళ్లాలి. వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వెళ్లాల్సిన వాహనాలు కంబాల చెరువు, హైటెక్ బస్టాండ్, చిరంజీవి బస్టాండ్, కోరుకొండ రోడ్డు, క్వారీ సెంటర్, దానవాయిబాబు గుడి, వైఎస్సార్ విగ్రహం మీదుగా లాలాచెరువు జంక్షన్‌కు వెళ్లాలి.

విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటాం



విలేకరులతో మాట్లాడుతున్న వనపర్తి వెంకట బద్రి

కంబాలచెరువు: ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఫార్మసీ విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉందని, దీనికి కారకుడైన దీపక్‌ను కఠినంగా శిక్షించాలని పెరికి కుల ఉభయ గోదావరి జిల్లా అధ్యక్షుడు వనపర్తి వెంకట బద్రి అన్నారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై గురువారం బొల్లినేని ఆసుపత్రి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగిన తర్వాత బాధిత విద్యార్థిని చికిత్స అందించే సమయంలో తన చెల్లిగా దీపక్ ఆసుపత్రి వారికి, తోటి స్నేహితులకు చెప్పాడన్నారు. అయితే డైరీలో విద్యార్థిని రాసిన నోట్ దొరికిన తర్వాత కనిపించకుండా పోయాడన్నారు. అతడిని పోలీసులు రెండురోజుల్లో పట్టుకున్నారన్నారు. విద్యార్థిని స్నేహితులనూ పోలీసులు విచారణ చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెరికి కులస్తులు బాధిత కుటుంబానికి అండగా ఉంటారన్నారు. న్యాయం కోసం, సహాయం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను విద్యార్థిని తల్లిదండ్రులు కలిశారన్నారు. జనసేన సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థినిని ఈ స్థితికి తీసుకువచ్చిన దీపక్‌ను వదిలేది లేదన్నారు.

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎర్నెస్ట్ మోజెస్

కంబాలచెరువు: స్థానిక జాంపేట లూథరన్ హైస్కూల్లో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హ్యూమన్ రైట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పదో తరగతి తర్వాత అందుబాటులో ఉండే వివిధ కోర్సులను వివరించారు. నివ్య ఒకేషనల్ జూనియర్ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ పి.ఎర్నెస్ట్ మోజెస్ మాట్లాడుతూ జనరల్ కోర్సులు, ఒకేషనల్ కోర్సుల వివరాలు, వాటి పరీక్షా విధానం తెలిపారు. కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్, షాడే గరల్స్ హైస్కూల్, చున్నీలాల్ జాజు, రోటరీ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు, హ్యూమన్ రైట్స్ క్లబ్ లీడర్లు శ్రావణి, స్వాతి, అనూష, కావేరి, లక్ష్మి పాల్గొన్నారు.

దోమల దండయాత్ర

కంబాలచెరువు: నగర ప్రజలపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. రాత్రీపగలు అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా లాలాచెరువు, చాడేశ్వర నగర్ ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలతో నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోవడానికి పారిశుధ్య లోపమే ప్రధాన కారణమని తెలుస్తోంది. గ్లో గార్డెన్ ప్రాంతం, అక్కడ నుంచి ఆ వీధి చివర వరకు దోమల బాధ అధికంగా ఉంది. లక్ష్మీ ఎన్‌క్లేవ్, సావిత్రీ టవర్స్, ఎమ్ఎస్ ప్యారడైజ్, మణికంఠ బ్లిస్, ఆ ప్రాంతంలోని ఇతర అపార్ట్‌మెంట్ల వాసులు దోమల బాధతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలోని డ్రైనేజీలో భారీగా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. నీరు అక్కడే నిల్వ ఉండిపోవడంతో విపరీతమైన దుర్గంధం వెలువడుతోంది. ఆ నీటిలో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.



డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు, చెత్త

16 కేజీల గంజాయి స్వాధీనం



నిందితుడితో ధవళేశ్వరం సీఐ గణేష్, సిబ్బంది

ధవళేశ్వరం: విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం నుంచి హర్యానాకు తరలిస్తున్న 16 కేజీల గంజాయిని ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ జిల్లాకు చెందిన రాకేష్ నరావత్ ఏజెన్సీ నుంచి 16 కేజీల గంజాయిని సంచిలో వేసుకొని తీసుకువెళుతున్నాడు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా రాకేష్ నరావత్ వద్ద ఉన్న 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. గంజాయిని స్వాధీనం చేసుకున్న ధవళేశ్వరం సీఐ టి.గణేష్, సిబ్బందిని ఎస్పీ డి.నరసింహకిషోర్, డీఎస్పీ భవ్యకిషోర్ అభినందించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



స్టార్టప్‌ను ప్రారంభిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: వినూత్న ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే ఔత్సాహికులకు పూర్తి సహకారం అందిస్తామని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) తెలిపారు. ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు రూపొందించిన డిజిటల్ మార్కెటింగ్ స్టార్టప్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు జీజీయూ సిద్ధంగా ఉందన్నారు. అందుబాటులో ఉన్న వనరులతోనే ఈ స్టార్టప్ తయారు చేశామని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ కేవీబీ రాజు, హెచ్ఓడీ డాక్టర్ బీవీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

కంబాలచెరువు: విద్యార్థినిని వేధించిన ఆటోడ్రైవర్‌పై గురువారం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. దివాన్ చెరువుకు చెందిన బాలిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి కళాశాలలో చదువుతోంది. ఆమె తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆ సమయంలో ఆటో డ్రైవర్ ఆ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కల్యాణం

పెదపూడి: సంపర గ్రామంలో జరుగుతున్న శ్రీరామ సప్తాహాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీనివాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వైఖానస పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో పది మంది పండితులు తిరుపతిలో జరిగే విధంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణాన్ని కనులారా తిలకించారు. పండితుడు హనుమంతాచార్యులు, ఫణిశ్రీ దంపతులు యజ్ఞకర్తలుగా కూర్చున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదం, కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి భజన భక్త మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురి అరెస్ట్



అనపర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సుమంత్

పెదపూడి: వ్యక్తి దాడి చేసి మొబైల్, నగదు లాక్కున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్లు అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. ఈ మేరకు గురువారం అనపర్తి పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. అనపర్తిలోని కరివేపాకుపేటకు చెందిన ఆకుల సురేష్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఈ నెల 2వ తేదీ రాత్రి 11.45 గంటల సమయంలో పూరీ – తిరుపతి రైలు ఎక్కడానికి ఇంటి నడుచుకుంటూ వెళుతున్నాడు. అయితే సురేష్‌ను స్థానికంగా నివాసముంటున్న పిల్లి కార్తిక్, అతడి స్నేహితులు అయినవిల్లి వినయ్, అయినవిల్లి అంజి వెంబడించారు. అకారణంగా దుర్భాషలాడుతూ ముఖం, చేతులపై పిడిగుద్దులు గుద్ది మొబైల్‌ను లాక్కున్నారు. వెంటనే సురేష్ పరుగెత్తుకుంటూ తన ఇంటికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆ ముగ్గురూ అక్కడితో ఆగకుండా సురేష్ ఇంటికి వెళ్లి తలుపులు తక్షణం తెరవాలి లేకుంటే చంపుతామని బెదిరించారు. దీంతో భయాందోళనకు గురైన సురేష్ భార్య తలుపులు తెరవగా లోపలికి ప్రవేశించారు. పిల్లి కార్తిక్ తన జేబులోంచి చాకు బయటకు తీసి కేకలు వేస్తే చంపుతానని హెచ్చరించాడు. ఆకుల సురేష్ పీక మీద చాకు పెట్టి నగదు ఇస్తే వదిలేస్తామని భయపెట్టారు. ఆ సమయంలో తమ వద్ద రూ.1500 ఉన్నాయంటూ సురేష్ వారికి ఇవ్వగా ఆ నగదు లాక్కుని వెళ్లిపోయారు. ఈ ఘటనలో సురేష్, అతడి భార్యకు రక్తపు గాయాలయ్యాయి. అనంతరం బాధితుడు సురేష్ ఫిర్యాదుపై ఎస్సై శ్రీను నాయక్ కేసు నమోదు చేయగా సీఐ సుమంత పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ముగ్గురు నిందితులు ఉన్నారన్న సమాచారంతో ఎస్సై నాయక్, అదనపు ఎస్సై బి.దుర్గాప్రసాద్ సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో పిల్లి కార్తిక్ 2024 సెప్టెంబర్ రెండో వారంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో మద్యం తాగి కరివేపాకుపేటలో నివాసం ఉంటున్న బచ్చు సత్యవతి ఇంటిలోకి ప్రవేశించాడు. ఆమె చేతులకున్న గాజులను బంగారు గాజులు అనుకుని అపహరించుకుపోయాడు. అలాగే 2023లో గంజాయి కేసులో ముద్దాయి అని, అప్పుడు మైనర్‌గా ఉన్నాడదన్నారు. కాగా.. నిందితుల నుంచి నగదు, చాకు, మొబైల్, రోల్డ్ గోల్డ్ గాజులు రికవరీ చేసి, అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

వినాయకునికి వెండి ఆభరణాల సమర్పణ



స్వామివారికి వెండి ఆభరణాలను అలంకరిస్తున్న శ్రీనివాస్ తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక గణేష్‌చౌక్‌లోని వినాయక ఆలయానికి కడియపులంకకు చెందిన ఆలా శ్రీనివాస్, ఆలా రోహన్, కుటుంబ సభ్యులు తమ తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం గురువారం వెండి వస్తువులు సమర్పించారు. స్వామివారికి వెండి కిరీటం, తొండం, కర్ణాభరణాలు అందజేశారు. వాటికి అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి చింతా చలపతి, మాజీ కార్పొరేటర్లు కొండేటి భీమారావు, ద్వారా పార్వతి సుందరి, హరిహర మహా క్షేత్రం ఆలయ చైర్మన్ మార్గాన్ని సత్యనారాయణ మాట్లాడారు. వెండి ఆభరణాలు అందజేసిన దాత శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పడాల విజయ భాస్కర్, తిరుమలశెట్టి భాస్కర్, డాక్టర్ బళ్లా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బళ్లా సత్యవతి, రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, గణేష్ చౌక్ యూత్ పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరులోని కిర్లంపూడి మెసోనిక్ టెంపుల్ లాడ్జి ప్రాంగణంలో శృంగేరి జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ జన్మదినోత్సవం సందర్భంగా గౌతమీ నేత్రాలయం ఆధ్వర్యంలో గురువారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని విజయవాడ మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులను పరీక్షలు జరిపారు. అర్హులైన వారికి ఉచిత ఆపరేషన్లు చేస్తామని, కళ్లజోళ్లు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ గౌతమీ నేత్రాలయం చైర్మన్ డాక్టర్ వీకే రాజు అంధత్వ రహిత బాలల సమాజం కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. శ్రీశృంగేరి శారదా పీఠం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మాసోనిక్ లాడ్జి కార్యదర్శి రాధాకృష్ణ, ప్రముఖ న్యాయవాది, సీనియర్ మాసన్ మద్దూరి శివ సుబ్బారావు, గౌతమీ నేత్రాలయ ఎండీ వీవీ కుమార్, శారదా పీఠం ధర్మాధికారి వేలూరి బాలాజీ, వైద్యులు డాక్టర్ సంజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈఎండీపీ జిల్లా ఎక్స్‌పో

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన (ఈఎండీపీ) ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జిల్లా ఎక్స్‌పో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 10 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. జిల్లా మేనేజర్ సీహెచ్ ఉదయ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా డీఈవో కంది వాసుదేవరావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ జీవీఎస్ఎస్ నెహ్రూ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఈ ప్రదర్శన నిర్వహించామన్నారు. జిల్లా సమగ్ర శిక్షా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎ.గౌరీ శంకరరావు మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి ప్రతిభ ప్రదర్శించారని, భవిష్యత్తులో ఎక్కువ మంది ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈఎండీపీ ప్రోగ్రామ్ విద్యార్థుల్లో వ్యాపార మనస్తత్వాన్ని, సృజనాత్మక ఆలోచనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లోకి ప్రయోగాల ఫలితాలు



మొక్కజొన్న సాగుపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

రాజానగరం: ప్రయోగశాలలో వచ్చిన ఫలితాలను క్షేత్రాల్లోకి తీసుకువెళ్లడానికి ఏరువాక కేంద్రం కృషి చేస్తుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెగుళ్ల బెడద పెద్దగా లేని, అధిక దిగుబడులు అందించే నూతన వంగడాలను రూపొందించడం, వ్యవసాయానికి అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం ద్వారా అన్నదాతల ఆర్థిక పురోభివృద్ధికి పనిచేస్తున్నామన్నారు. వచ్చే సార్వా, దాళ్వా సీజన్లకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ముందస్తుగానే రైతులకు, వీఏఏలకు అందించాలన్నారు. దివాన్ చెరువు ఏరువాక కేంద్రం 2024–25లో నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే మొక్కజొన్న సాగుపై పోస్టర్ విడుదల చేశారు. మారుటేరు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రతినిధులు, సంఘ సభ్యులు, అభ్యుదయ రైతులు ప్రసంగించారు.